క్లుప్తంగా

9న క్రికెట్ టోర్నమెంట్

నందలూరు(రాజంపేట) : సంక్రాంతిని పురస్కరించుకొని ఈ నెల 9న నందలూరులోని క్రీడా మైదానంలో మండల స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నాగిరెడ్డిపల్లె అర్బన్ మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విన్నర్‌కు రూ.30 వేలు, రన్నర్‌కు రూ.20 వేలు ఇవ్వనున్నామన్నారు. రాజు విద్యాసంస్థల అధినేత చమర్తి జగన్మోహన్‌రాజు సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారికి ఫ్రీ ఎంట్రీ ఉంటుందన్నారు.

10న వాలీబాల్ టోర్నమెంట్

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఈ నెల 10న వాలీవాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వీఆర్‌డీఎస్ సంస్థ అధ్యక్షులు సురేంద్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాల్గొనేవారు 15–29 ఏళ్ల మధ్య వారు అయిండాలని సూచించారు. గెలుపొందిన వారికి నగదు బహుమతితో పాటు మెమొంటోలు అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు 9వ తేదీలోపు 8639358797, 9490028324కు ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రామాంజులు



రాయచోటి అర్బన్ : సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా తనను నియమించినట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 2, 3, 4 తేదీలలో పశ్చిమగోదావరి భీమవరంలో జరిగిన సీఐటీయూ రాష్ట్ర మహాసభల్లో తన ఎంపిక కార్యక్రమం జరిగిందన్నారు. అన్నమయ్య జిల్లా సీఐటీయూ నుంచి తనను, పంచాయతీ కార్మికుల సంఘం నుంచి డి.వెంకట్రామయ్యను రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారన్నారు. తమతోపాటు జిల్లా కు చెందిన సి.హెచ్.చంద్రశేఖర్‌ను రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. తనపై సీఐటీయూ రాష్ట్ర నాయకత్వం ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



డీఎస్పీ శ్రీధర్

రాయచోటి టౌన్ : శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రాయచోటి డీఎస్పీ శ్రీధర్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అండర్ సెక్షన్ 30 పోలీస్ యాక్టు 1861 అమల్లో ఉందని తెలిపారు. కాబట్టి రాయచోటి డివిజన్ పరిధిలో సభలు, ర్యాలీలు, నిరసనలు నిర్వహించాలంటే ముందస్తు అనుమతులు తప్పనిసరిన్నారు. పోలీస్ వారి అనుమతులు లేకుండా ఎవరైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ సెక్షన్ జనవరి 1వ తేది నుంచి 31వ తేది వరకు అమల్లో ఉంటుందని చెప్పారు. ప్రజలు పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

బైరి నరేష్ వ్యాఖ్యలపై నిరసన

రామాపురం : హిందూ దేవతలను కించపరిచి మాట్లాడిన బైరి నరేష్‌పై పీడీ యాక్టు కేసు నమోదు చేయాలని మాజీ ఎంపీపీ గడికోట జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్పస్వామి మీద ఎంతో నమ్మకంతో ఉపవాసాలు ఉంటూ కొండకు వెళ్లి మొక్కులు చెల్లించుకుంటున్న స్వాములను కించపరిచే విధంగా మాట్లాడడం తగదని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, నల్లగుట్టపల్లె సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, మురళీధర్‌రెడ్డి, రామోహన్‌రెడ్డి, వీరారెడ్డి, చిన్నరెడ్డి, సత్యయాదవ్, మండల అయ్యప్పస్వామి భక్త సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామరక్ష స్తోత్ర పారాయణం

ఒంటిమిట్ట (సిద్దవటం): ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న భక్త సంజీవరాయ ఆలయంలో డి.ఎస్. భగవాన్ ఆధ్వర్యంలో శ్రీరామరక్ష స్తోత్ర పారాయణం గురువారం నిర్వహించారు. సీతారామ లక్ష్మణమూర్తుల విగ్రహాలకు వేద పండితులు అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం, శుక్రవారం పారాయణం ఉంటుందని తెలిపారు.

సకాలంలో జీతాలు చెల్లించాలి

లక్కిరెడ్డిపల్లి : ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించాలని ఆపాస్ జిల్లా కార్యదర్శి నరసింహులు పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లిలో ఆపాస్ ఉపాధ్యాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సెలవులు జనవరి 11వ తేది నుంచి 16వ తేది వరకు ఇచ్చారని, 18వ తేది వరకు పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.నరసింహులు, జిల్లా మీడియా ఇన్‌చార్జ్ కె.వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు నాగులయ్య, కోశాధికారి మల్లయ్య, మండల ఉపాధ్యక్షులు వి సుబ్బారెడ్డి, టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పింఛన్ల పండుగ.. ఆనందం నిండుగ

- కొనసాగుతున్న పెన్షన్ కానుక వారోత్సవాలు
- కొత్తవి, పెంచినవి పంపిణీ
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు





వీరబల్లి : లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, పెనగలూరులో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి





నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె అర్బన్ కేంద్రంలో ఎంపీపీ మేడావిజయభాస్కర్‌రెడ్డి, చిన్నమండెంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి

వీరబల్లి : పెన్షన్ కానుక వారోత్సవాలను పండుగలా నిర్వహిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొత్త పింఛన్లు, పెంచిన పింఛన్లను ప్రజాప్రతినిధులు, అధికారులు పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 1 నుంచి 7 వ తేదీ వరకు పెన్షన్ కానుక వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో వీరబల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నూతన, పెంచిన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి విచ్చేశారు. నూతనంగా మంజూరైన పింఛన్లు, అదే విధంగా ప్రభుత్వం పెంచిన పింఛన్ నగదు రూ. 2,750ను లబ్ధిదారులకు గ్రామాల వారీగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వృద్ధుల ఇంటి వద్దకు వెళ్లి డోర్ తట్టి పింఛన్లను వలంటీర్లు అందజేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, జెడ్పీటీసీ శివరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరనాగిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ తులసమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం

సుండుపల్లె (వీరబల్లి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకటమల్లికార్జునరెడ్డి తెలిపారు. సుండుపల్లె మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం అవ్వా, తాతలకు పింఛన్‌ను రూ.2750లు పెంచడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకుడు బిఎల్ నరసింహారెడ్డి, జెడ్పీటీసీ ఇస్మాయిల్, ఎంపీపీ రాజమ్మ, మండల మైనార్టీ నాయకుడు రెహ్మాన్ ఖాన్, మండల కో–ఆప్షన్ మెంబర్ కలీం బాష, ఎంపీడీఓ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ మంజూరు

నందలూరు(రాజంపేట) : అర్హులందరికీ పెంచిన పింఛన్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నాగిరెడ్డిపల్లె జిల్లాపరిషత్ హైస్కూల్‌లో సర్పంచ్ జంబు సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన పింఛన్ల పంపిణీ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న పాలన ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌభాగ్య, మండల ఉపాధ్యక్షులు నాయనపల్లె అనుదీప్, తుమ్మలభావన శ్రీధరగౌడ్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ నాయకులు హస్తవరం సుబ్బరామిరెడ్డి, ధనుంజనాయుడు, నడివీధి సుధాకర్, హిమగిరి యాదవ్, నాయనపల్లె ఆదినారాయణ, మైనార్టీ నాయకులు నవాబు, మన్సూర్, సంఘ సేవకుడు వేపగుంట సాంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన భరోసా

సంబేపల్లె : సామాజిక పింఛన్ల పెంపుతో లబ్ధిదారులకు భరోసా పెరిగిందని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి పేర్కొన్నారు. చిన్నమండెం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి మాసం నుంచి పెంచిన రూ.250తో కలిపి మొత్తం పింఛన్ రూ.2,750 లబ్ధిదారులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివ్య, తహసీల్దార్ శ్రీరాములునాయక్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, ఎంపీటీసీలు రెడ్డప్ప, వెంకటప్పనాయుడు, గంగులయ్య, శ్రీరాములు, శ్యామ్, సర్పంచులు నజీర్ అహమ్మద్, లోకేశ్వర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, జగన్నాథరెడ్డి, నజీర్‌బాషా, దామోదర్, రమణ, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నెరవేర్చిన సీఎం

పెనగలూరు : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా పింఛన్లు పెంచుతూ వస్తున్నారని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు హయాంలో 65 ఏళ్లకు పింఛన్లు ఇచ్చేవారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 60 ఏళ్ల వారికే పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు వై సుబ్బరాయుడు, మండల అధ్యక్షురాలు సౌందర్య, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కేతా చక్రపాణి, కట్టావారిపల్లి సర్పంచ్ శివయ్య నాయుడు, మండలంలోని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఈటమాపురంలో..

మండలంలోని ఈటమాపురం సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, సెక్రటరీ సౌజన్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే జనరంజక పాలన

- అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు
- గడపగడపకు మన ప్రభుత్వంలో విప్ కొరముట్ల



సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే జనరంజక పాలన సాధ్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 3వ సచివాలయం పరిధి సూర్యానగర్, వినాయకనగర్‌లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన జీవితం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనులు నిర్వహిస్తోందన్నారు. గత ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడలేదని తెలియజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుతీరు చూసి ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేయడం జరుగుతోందన్నారు. ఇప్పటికే ఈ నిధులతో కొన్ని గ్రామాలలో అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి మూడేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎక్జ్సిక్యూటివ్ మెంబర్ హేమనవర్మ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, సిహెచ్.రమేష్, మండల నాగేంద్ర, ఎంపీడీవో నాగార్జున, ఎంపీటీసీ షబానా, ఏవో సుధాకర్, వైఎస్ కరీముల్లా, రౌఫ్, మండల ప్రవీణ్, డమ్ము రఘు, శ్రీరామ్ వినోద్, మల్లు క్రిష్టారెడ్డి, పుష్పలత, నాగమణి, అరుణ, దాడిశెట్టి సిద్దు, జనార్ధన్‌రాజు, బండారు మల్లి, వినోద్‌ఖన్నా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి



భోజనం వడ్డిస్తున్న దాతలు

వీరబల్లి : షిర్డీ సాయిబాబా ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని గాలివీటి మురళీరెడ్డి పేర్కొన్నారు. షిర్డీ సాయిబాబా మందిరంలో ప్రతి గురువారం జరిగే అన్నదాన కార్యక్రమంలో భాగంగా గాలివీటి మురళీరెడ్డి, సౌమ్య దంపతులు అన్నదాన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాత మురళీరెడ్డి మాట్లాడుతూ ప్రతి గురువారం దాతల సహకారంతో నిర్విరామంగా అన్నదానం చేయడం జరుగుతోందని, కావున దాతలు తమ శక్తి మేరకు సహకరించాలని కోరారు. అనంతరం అన్నదాతలు మురళీరెడ్డి, సౌమ్య దంపతులను ఆలయ చైర్మన్ రామకృష్ణమరాజు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రాఘవేంద్రస్వామి, సాయి భక్తులు, అన్నమయ్య జిల్లా విశ్వ హిందూపరిషత్ ఉపాధ్యక్షుడు ఆంజనేయులురెడ్డి, వీరబల్లి అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, శైలేశ్వర్‌రెడ్డి, వీఆర్‌డీఎస్ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి తరువాత రైతు బజార్ ప్రారంభిస్తాం



రైతు బజార్‌ను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు

రాయచోటి టౌన్ : సంక్రాంతి పండుగ తరువాత రైతు బజార్‌ను ప్రారంభిస్తామని రాయచోటి మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ వందాడి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన రాయచోటి పట్టణ నడిబొడ్డులో ఉన్న రైతు బజార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రారంభం అయినప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆగిపోయిన రైతు బజార్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ రైతు బజార్ వేదికగా సుమారు 50 మందికి పైగా పేద, చిరువ్యాపారులు జీవనోపాధి పొందే విధంగా కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించకుంటే చర్యలు



మాట్లాడుతున్న సర్పంచ్ చిన్న వెంగల్‌రెడ్డి

పెనగలూరు : పంచాయతీలలో ప్రతి రోజూ చెత్తను గ్రీన్ అంబాసిడర్‌లు తొలగించకుంటే విధుల నుంచి తొలగిస్తామని పెనగలూరు సర్పంచ్ దేవూరి చిన్న వెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రీన్ అంబాసిడర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో చెత్తను తొలగించలేదని అనేక మంది ఫిర్యాదు చేశారని, ఇకపై పద్ధతి మార్చుకోవాలని సూచించారు. వలంటీర్లు పంచాయతీలోని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పంచాయతీలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ సురేష్ బాబు, వెంకటసుబ్బయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

కురబలకోట: పశువులు రైతుల నేస్తాలని వాటి ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి మండల పశువైద్యాధికారి సౌజన్య అన్నారు. చింతయ్యగారికోటలో పశు విజ్ఞానబడి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశు సంపద ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ ఎస్‌జి.ధరణి నాథ్‌రెడ్డి, గోపాల మిత్ర సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

రాజంపేట టౌన్ : పట్టణంలోని రామ్‌నగర్‌లో వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నూతన ఏడాదిలో తొలి గురువారాన్ని పురస్కరించుకొని వివిధ పూజా కార్యక్రమాలను చేపట్టారు. అందులో భాగంగా అభిషేకాలు, పల్లకీసేవ కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే సాయిబాబా మూలవిరాట్‌కు పుష్పాభిషేకం చేశారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. వారికి నిర్వాహకులు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

అవకతవకలు లేకుండా ఉపాధి పనులు



మాట్లాడుతున్న సర్పంచ్ నాగార్జునాచారి

వీరబల్లి : మట్లి గ్రామ పంచాయతీలో 16, 17వ విడత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులు అవకతవకలు లేకుండా జరగడం అభినందించదగ్గ విషయమని సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా మట్లి సచివాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు బాగా జరగడంతో కూలిలు కూడా అదే స్థాయిలో పడ్డాయన్నారు. గతంలో లాగే పనులలో ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీ అక్కులప్ప, టీఏలు సురేంద్రరెడ్డి, దామోదర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ బాబు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

భూ కబ్జాలను పరిశీలించిన ఆర్డీఓ



భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ కోదండరామిరెడ్డి

ఓబులవారిపల్లె : పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 2204లో భూ కబ్జాలను రాజంపేట ఆర్డీఓ కోదండరామిరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత సర్వే నంబరులో భూములు కబ్జా అవుతున్నాయని తమ దృష్టికి రావడంతో.. తాము పరిశీలనకు రావడం జరిగిందని తెలిపారు. భూములను, రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ పీర్‌మున్నీ, ఆర్ఐ సదాశివ, వీఆర్‌ఓ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన రహిత వ్యవసాయం మేలు



పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

వీరబల్లి : రసాయన రహిత వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని మట్లి, తోటపల్లి, పెద్దివీడు, రెడ్డివారిపల్లి, సంఘంవారిపల్లి గ్రామాలలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు వ్యవసాయ సాగులో పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ, ఏఓలు, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దారు శంకర్‌రావు

సిద్దవటం : జగనన్న కాలనీల్లోని పక్కా గృహాల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని తహసీల్దారు శంకర్‌రావు తెలిపారు. మండలంలోని మాధవరం-1 గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న హౌసింగ్ కాలనీలో పక్కా గృహాల నిర్మాణాలపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా పనులు మొదలు పెట్టకుండా ఉన్న లబ్ధిదారులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. గ్రావెల్ కావలసిన వాళ్లు అనుమతి తీసుకొని మట్టి తవ్వకాల ప్రదేశాలను చూపించిన చోట మాత్రమే జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి లక్ష్మీనరసయ్య, వీఆర్‌వో గౌస్, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన మసీదు ప్రారంభం



ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

రామాపురం : మండలంలోని హసనాపురంలో నూతనంగా నిర్మించిన జమియా మసీదును ప్రభుత్వ సర్కార్జి, ముస్లిం మత పెద్దలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మసీదును పూర్వం రాళ్లతో నిర్మించారని, వర్షం వస్తే ఇబ్బందికరంగా ఉండేదని తెలిపారు. కావున గ్రామంలోని పెద్దలు, ఇతర ప్రాంతాల్లోని దాతల సహకారంతో పునర్నిర్మించినట్లు పేర్కొన్నారు. అనంతరం వారు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు, గ్రామస్తులు పాల్గొన్నారు.